క్లుప్తంగా

భోజనం, స్నాక్స్ పంపిణీ

కొత్తపట్నం: ఆకలితో అలమటిస్తున్న అనాథ పిల్లలు, వికలాంగులు, వృద్ధులు, భిక్షాటకులకు మదర్ థెరిస్సా హెల్పింగ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం భోజనం ప్యాకెట్లు, స్నాక్స్ పంపిణీ చేశారు. చిటితోటి రమేష్ బాబు, ఆదిలక్ష్మి పెళ్లి రోజు సందర్భంగా వారి ఆర్థికసాయంతో ఆర్గనైజేషన్ సభ్యులు డి.కేశవ, ఎం.సునీల్, డి.రజిత్, నాని తదితరులు ఈ కార్యక్రమం నిర్వహించారు.

నేడు ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్

ఒంగోలు: ప్రభుత్వంలో విలీనమైన స్థానిక సెయింట్ థెరిస్సా యాజమాన్యంలో పని చేసే ఉన్నత, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు ఈ నెల 21వ తేదీ ఉదయం 10 గంటలకు జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ఏపీటీజీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోడూరి వెంకట్రావు, సీహెచ్ ప్రభాకరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వారితో పాటు జిల్లాలో విద్యార్థులు లేక జీరో ఎన్‌రోల్‌మెంట్ ఉన్న పాఠశాలల్లో పనిచేసే మిగిలిన 75 మంది ఉపాధ్యాయులకు కమిషనర్ అనుమతి తీసుకుని కౌన్సెలింగ్ నిర్వహించాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. చెరుకూరు ఆంధ్రకేసరి మెమోరియల్ రెసిడెన్షియల్ పాఠశాలలో పనిచేసే ఇద్దరు ఉపాధ్యాయులు స్వచ్ఛంద పదవీ విరమణ చేయలేదని, 8 నెలలుగా జీతాలు నిలుపుదల చేశారని అన్నారు. వారికి వెంటనే ఆర్‌జేడీ జీతాల చెల్లింపునకు చర్యలు తీసుకోవాలన్నారు. కొమరోలు మండలం గోవనపల్లి ఏబీఎం ఎయిడెడ్ పాఠశాలలో పనిచేసే ఐదుగురు ఉపాధ్యాయులకు వార్షిక ఇంక్రిమెంట్లు ఇవ్వని యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థులు లేక ఖాళీగా ఉన్న ఎయిడెడ్ ఉపాధ్యాయులను రోజుకో పాఠశాల చొప్పున రకరకాలుగా ఇబ్బందులకు గురిచేస్తున్న యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలో పనిచేసే తెలుగు, హిందీ, సంస్కృతం, పీఈటీ ఎయిడెడ్ ఉపాధ్యాయుల జాబితాను కమిషనర్ కార్యాలయానికి పంపి జీవో నంబర్ 80, 114 ప్రకారం పదోన్నతి సౌకర్యం కల్పించాలన్నారు. పుల్లలచెరువు మండలం మానేపల్లి ఉమామహేశ్వర ఎయిడెడ్ పాఠశాలలో పని చేసి పదవీ విరమణ పొందిన ఇద్దరు ఉపాధ్యాయులకు మూడు నెలల నుంచి వారి సర్వీస్ రిజిస్టర్లను జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయ సిబ్బంది ఏజీ ఆఫీసుకు పంపలేదని, వారిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



నిరుపయోగంగా ఉన్న టిడ్కో ఇళ్లు

అటకెక్కిన పోతురాజుకాలువ ఆధునికీకరణ...

నగరంలో ప్రధాన డ్రైనేజీ కాలువ అయిన పోతురాజుకాలువను ఆధునికీకరిస్తామని ఎన్నికల వేళ దామచర్ల హామీ ఇచ్చారు. వర్షం కురిసినప్పుడల్లా ఆ కాలువ పొంగిపొర్లి చుట్టుపక్కల కాలనీల్లో నీరు నిలుస్తోంది. రోజుల తరబడి సమస్య నెలకొంటోంది. కనీసం ఇలాంటి సమస్య పరిష్కారంపై కూడా దామచర్ల దృష్టి సారించిన దాఖలాలు లేవు. పోతురాజుకాలువ పనులు గత ప్రభుత్వంలో కొంతవరకు పూర్తయ్యాయి. మిగతా భాగాన్ని ప్రస్తుత ప్రభుత్వం ఎప్పటిలోగా పూర్తిచేస్తారనేది తెలియడంలేదు.



చెత్తాచెదారంతో నిండిపోయిన పోతురాజుకాలువ

ఒంగోలుకు ఒరిగిందేంటి.?

ఒకవైపు కూటమి ప్రభుత్వం వందరోజుల పాలనలో సాధించిన విజయాలంటూ ఆర్భాటపు ప్రచారాలు ప్రారంభించగా, మరోవైపు.. వంద రోజుల్లో ఏం సాధించారంటూ ప్రజలు పెద్ద ఎత్తున విమర్శిస్తున్నారు. సూపర్‌సిక్స్ పథకాలతో పాటు ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పినవేవీ ప్రభుత్వం అమలు చేయకపోగా, స్థానిక ఎమ్మెల్యేలు సైతం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను బుట్టదాఖలు చేయడంపై జనం మండిపడుతున్నారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌తో నగరానికి ఒరిగిందేమీ లేదంటున్నారు. గత ప్రభుత్వం పట్టాలు పంపిణీ చేసిన ఇళ్ల స్థలాలను సైతం లబ్ధిదారులకు దూరం చేయడం, ఇళ్ల నిర్మాణాలను నిలిపివేయడాన్ని పేదలు జీర్ణించుకోలేకపోతున్నారు. ఇసుక, రేషన్ దందాలు, పార్టీ శ్రేణులకు అవినీతి కార్యకలాపాల పంపిణీ, వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లను టీడీపీలో చేర్చుకుని ఒంగోలు కార్పొరేషన్‌ను కైవసం చేసుకునేందుకు పాకులాడటం మినహా.. అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి సారించిన దాఖలాలు లేకపోవడంతో ఎమ్మెల్యే దామచర్ల తీరుపై నియోజకవర్గ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

- వంద రోజుల కూటమి పాలనలో నగరంలో అభివృద్ధి, సంక్షేమం శూన్యం
- అమలుకు నోచుకోని ఎమ్మెల్యే దామచర్ల ఎన్నికల హామీలు
- అటకెక్కిన ఇళ్ల స్థలాలు, ఇళ్ల నిర్మాణాలు
- నిత్యం తాగునీరు, భూగర్భ డ్రైనేజీ హామీలు గాలికి..
- నగరంలో ఎక్కడ చూసినా చెత్తాచెదారం, మురుగు
- రేషన్ షాపులు, ఇసుక దందాలు, కార్పొరేటర్ల పార్టీ ఫిరాయింపులకే ఎమ్మెల్యే పరిమితం
- పార్టీ శ్రేణులకు అవినీతి కార్యకలాపాల పంపిణీకి పెద్దపీట
- నమ్మి ఓట్లేసి నష్టపోయామంటున్న నియోజకవర్గ ప్రజలు

ఒంగోలు:

మన ప్రభుత్వం వస్తుంది.. మంచి రోజులు వస్తాయంటూ ఎన్నికల సమయంలో మోసపూరిత హామీలతో టీడీపీ నుంచి ఒంగోలు ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేసిన దామచర్ల జనార్దన్ ప్రచార కార్యక్రమాలలో ఊదరగొట్టారు. కూటమి ప్రభుత్వం పాలనా పగ్గాలు చేపట్టి వంద రోజులైనా.. ఒంగోలు ఎమ్మెల్యేగా దామచర్ల గెలిచినా.. నేటికీ ఒరిగిందేమీ లేకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను పూర్తిగా పక్కన పెట్టేశారు. టీడీపీ శ్రేణుల అవినీతి కార్యకలాపాలకే పెద్ద పీట వేశారు. రేషన్ షాపుల నిర్వాహకులతో బలవంతంగా రాజీనామాలు చేయించి టీడీపీ వర్గీయులకు వాటిని కేటాయించారు. ఇసుక దందాలతో పేట్రేగిపోతున్నారు. పేదల పట్టాలపై కుట్రలు చేస్తున్నారు. వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లను బెదిరించి టీడీపీలో చేర్చుకుని ఒంగోలు నగరపాలక సంస్థను కైవసం చేసుకోవాలని ప్రయతిస్తున్నారు. ఇంతకుమించి ఎమ్మెల్యే దామచర్ల వంద రోజుల పాలనలో చేసిందేమిటనే చర్చ ప్రస్తుతం ఒంగోలు నియోజకవర్గంలో నడుస్తోంది. వంద రోజుల పాలనలో ఏదో గొప్పగా సాధించినట్లు, ప్రజలకు ఏదో మేలు చేసినట్లు కూటమి ప్రభుత్వం ప్రజల్లోకి వెళ్లి డప్పు కొట్టుకోవాలని చూడటాన్ని జనం తీవ్రంగా విమర్శిస్తున్నారు.



వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పేదలకు కేటాయించిన ఇళ్ల స్థలాలు

టిడ్కో ఇళ్ల హామీ ఏమైంది..?

2014–19లో టీడీపీ హయాంలో చేపట్టిన టిడ్కో ఇళ్లకు సంబంధించి ఇళ్ల కంటే లబ్ధిదారులను అధికంగా గుర్తించారు. వారి వద్ద నుంచి పెద్ద ఎత్తున నగర పాలక సంస్థ అధికారుల ద్వారా నగదు వసూలు చేశారు. లబ్ధిదారులకు ఇళ్లు మంజూరైనట్లు పేర్కొంటూ వారి వద్ద నుంచి వాయిదాల రూపంలో నిధులు జమచేసుకున్నారు. తీరా చూస్తే అక్కడ ఇళ్ల సంఖ్యకు.. ఎంపిక చేసిన లబ్ధిదారుల సంఖ్యకు భారీ వ్యత్యాసం ఉంది. మరో వైపు ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి ఆరోపణలు వెల్లువెత్తడం, ప్రభుత్వం మారడంతో ఈ వ్యవహారం వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి తలనొప్పిగా మారింది. చివరకు ఇళ్లు మంజూరైనట్లు పేర్కొంటూ వాయిదాలు కట్టించుకుని ఇళ్లు మంజూరు కాని వారికి వారు చెల్లించిన మొత్తం నగదు తిరిగిచ్చే ప్రక్రియను కూడా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిర్వహించింది. అంతేగాకుండా పేదలు వాయిదాలు చెల్లించలేరంటూ ఒక్క రూపాయికే నిరుపేద లబ్ధిదారులకు ఇళ్లు కట్టించాలని యత్నించారు. దీనిపై గత ఎన్నికల సమయంలో తాము అధికారం చేపట్టగానే టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తిచేస్తామని కూటమి ప్రభుత్వంతో పాటు స్థానిక ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ హామీ ఇచ్చారు. కానీ, నేటికీ ఆ దిశగా దృష్టి సారించిన దాఖలాలు లేవు. వాటిని ఎప్పటిలోగా పూర్తిచేసి లబ్ధిదారులకు అందిస్తారో, లబ్ధిదారులపై భారం పడకుండా ఎలా చర్యలు చేపడతారో కూడా ప్రకటించిన దాఖలాలు కూడా లేకపోవడంతో ప్రజలు తీవ్ర నిరాశ చెందుతున్నారు.

అండర్ గ్రౌండ్ డ్రైనేజీపై నోరెత్తని దామచర్ల...

నగరంలో డ్రైనేజీ సమస్య ప్రధానంగా ఉంది. ఎక్కడ చూసినా మురుగు, దోమల విజృంభన కారణంగా వ్యాధులతో జనం బెంబేలెత్తిపోతున్నారు. ఈ నేపథ్యంలో తాము అధికారంలోకి వస్తే అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి ప్రాధాన్యం ఇస్తామని దామచర్ల ప్రకటించారు. కానీ నేటికీ ఆ దిశగా ప్రాథమిక చర్యలు కూడా లేవు. కనీసం నగరపాలక సంస్థలో చర్చ కూడా లేదు. అవినీతికి కేరాఫ్‌గా నగరపాలక సంస్థ మారిందని నాడు మేయర్, కార్పొరేటర్ల గురించి విమర్శించిన దామచర్ల.. నేడు వారినే టీడీపీలో చేర్చుకోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చివరకు.. మురుగు లేని కాలనీని చూద్దామనుకున్న శివారు ప్రాంతాల ప్రజల ఆశలు అడియాశలయ్యాయి. నగరంలో ఎక్కడ చూసినా చెత్తాచెదారం, మురికికూపాలు కనిపిస్తున్నాయి.

రెండు సెంట్ల ఇళ్ల స్థలం ఎక్కడ...

గత ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇళ్లు లేని ప్రతి ఒక్కరికీ ఇంటి స్థలం ఇవ్వడంతో పాటు ఇళ్లు కూడా కట్టించి ఇవ్వాలన్న ఉద్దేశంతో రూ.230 కోట్లతో భూములు కొనుగోలు చేశారు. పేదలకు పట్టాలు పంపిణీ చేశారు. చివరకు వాటిని లబ్ధిదారుల పేరుతో సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ కూడా చేసిచ్చారు. అవి దొంగపట్టాలంటూ నాడు విమర్శించిన దామచర్ల.. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే 2 సెంట్ల చొప్పున పేదలకు ఇంటి స్థలం కేటాయించి పట్టాలు పంపిణీ చేస్తామన్నారు. దాంతోపాటు ఇళ్లు కూడా కట్టించి ఇస్తామన్నారు. కానీ, నాడు ఇచ్చిన ఇళ్ల పట్టాలు పేదలకు దక్కకుండా ఇటీవల నగరపాలక సంస్థ పాలకమండలి సమావేశంలో నిజ నిర్ధారణ కమిటీ అంటూ అడ్డం కొట్టడంపై లబ్ధిదారులు మండిపడుతున్నారు.

రోజూ తాగునీటి సరఫరా ఏమైనట్లు..?

ప్రతిరోజూ తాగునీటిని పగటిపూటే సరఫరా చేస్తామన్న దామచర్ల హామీ కూడా రోడ్డెక్కలేదు. నగరానికి రోజూ తాగునీటి పంపిణీకి రూ.330 కోట్లతో గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం ఎన్నికల కోడ్ రావడం, నూతన ప్రభుత్వం ఏర్పాటవడం జరిగాయి. వంద రోజులు గడిచినా తాగునీటి ప్రాజెక్టు పనులు ఎప్పుడు ప్రారంభం అవుతాయో తెలియని పరిస్థితి. యూనివర్సిటీకి వీసీని మార్చడం తప్పించి యూనివర్సిటీకి అవసరమైన నిధుల కేటాయింపు కూడా లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. రహదారులు ఘోరంగా ఉన్నాయని నాడు విమర్శలు చేసిన కూటమి నేతలు.. నేడు ఏ రోడ్డునైనా బాగుచేశారా..? అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఏదిఏమైనా నగరపాలక సంస్థ పాలకవర్గాన్ని తమ వశం చేసుకోవడం, దోచుకోవడంపై చూపిన శ్రద్ధను నగర అభివృద్ధిపై, ప్రజల సంక్షేమంపై ఎమ్మెల్యే దామచర్ల చూపడం లేదంటూ జనం తీవ్రంగా విమర్శిస్తున్నారు.

ఎక్కడివక్కడే..!

- సంతనూతలపాడు నియోజకవర్గంలోనూ అడుగు ముందుకు పడని హామీలు

చీమకుర్తి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులు పూర్తి చేసుకున్నా.. సంతనూతలపాడు నియోజకవర్గంలో ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీలకు సంబంధించి ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. ఒంగోలు నుంచి మర్రిచెట్లపాలెం వరకు రామతీర్థం పరిధిలో పూర్తిగా దెబ్బతిన్న రోడ్డుకు కనీసం మరమ్మతులు కూడా చేయలేదు. దీనిపై ప్రజల నుంచి విమర్శల వర్షం కురుస్తోంది. ఎస్ఎస్ఎన్ కాలేజీ నుంచి మర్రిచెట్లపాలెం వరకు ఫోర్‌లైన్ రోడ్డు నిర్మిస్తామనే హామీపై స్థానిక ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ నోరు మెదపడం లేదు. గుండ్లకమ్మ ప్రాజెక్టును పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామని చెప్పిన మాటలు నీటి మూటలుగానే ఉన్నాయి. కొట్టుకుపోయిన గుండ్లకమ్మ గేట్లకు పూర్తిగా మరమ్మతులు కూడా చేయలేదు. కారుమంచి కాలువ పునర్నిర్మాణానికి 100 రోజుల పాలనలో ఒక్క రూపాయి కూడా ప్రభుత్వం కేటాయించకపోవడం, స్థానిక ఎమ్మెల్యే కనీసం స్పందించకపోవడంపై ప్రజలు తీవ్రస్థాయిలో అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



మద్దిపాడులో వాలీబాల్ పోటీల్లో తలపడుతున్న బాలురు



కబడ్డీ ఆడుతున్న బాలికలు

ఎస్‌జీఎఫ్ ఎంపిక పోటీలు షురూ..

మద్దిపాడు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) మద్దిపాడు మండల స్థాయి ఎంపిక పోటీలను శుక్రవారం పూర్తి చేసినట్లు మండల కో ఆర్డినేటర్ పాపారావు తెలిపారు. ప్రతిభ కలిగిన విద్యార్థులను మండల స్థాయిలో ఎంపిక చేసి నియోజకవర్గ స్థాయికి, ఆపై జిల్లా స్థాయికి పంపనున్నట్లు ఆయన తెలిపారు. మండల కేంద్రంలోని కడియాల యానాదయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంపిక పోటీలు నిర్వహించారు. కబడ్డీ ఖోఖో, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, యోగా పోటీలు నిర్వహించగా, క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అండర్–14, అండర్–17 విభాగాలలో బాలబాలికల జట్లకు సెలక్షన్స్ నిర్వహించారు. ముందుగా ఎంఈఓ ఎంవీఆర్ ఆంజనేయులు మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని గెలుపొందాలని పిలుపునిచ్చారు. ఓడినవారు మరోమారు ప్రయత్నించి గెలవాలన్నారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పెద్దిరెడ్డి కోటిరెడ్డితో ఎంపిక పోటీలను ప్రారంభించారు. ఎంపికైన విద్యార్థుల జాబితాను శనివారం విడుదల చేస్తామని కన్వీనర్ తెలిపారు. కార్యక్రమంలో పాఠశాలల పీడీలు పాల్గొన్నారు.



కొత్తపట్నంలో ఎస్‌జీఎఫ్ క్రీడలను ప్రారంభిస్తున్న శ్రీదేవి, వంశీకృష్ణారెడ్డి



మద్దిపాడులో ఎస్‌జీఎఫ్ ఎంపిక పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈఓ ఆంజనేయులు, హెచ్‌ఎం, పీడీలు

క్రీడలతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు...

కొత్తపట్నం: క్రీడలతో విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని కొత్తపట్నంలోని బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.శ్రీదేవి అన్నారు. హైస్కూల్లో శుక్రవారం ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించారు. శ్రీదేవితో పాటు ఎస్ఎంసీ చైర్మన్ వంశీకృష్ణారెడ్డి పాల్గొని రిబ్బన్ కట్ చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడలు కూడా విద్యార్థులకు అవసరమని అన్నారు. మంచి క్రమశిక్షణతో పాటు ఆరోగ్యాన్ని క్రీడలు అందిస్తాయన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు కేవలం ప్రార్థనకు పరిమితం కాకుండా విద్యార్థులను క్రమశిక్షణలో ఉంచేందుకు తోడ్పాటు అందించాలని కోరారు. ఎస్ఎంసీ చైర్మన్ వంశీకృష్ణారెడ్డి మాట్లాడుతూ క్రీడల్లో పాఠశాలకు జిల్లా స్థాయిలో గుర్తింపు తీసుకురావాలని కోరారు. శుక్రవారం 100 మీటర్లు, 200, 400, 800 మీటర్ల రన్నింగ్ పోటీలు నిర్వహించారు. శనివారం ఖోఖో, కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్ పోటీలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో పీడీల అసోసియేషన్ మండల సెక్రటరీ, కొత్తపట్నం పీడీ సాయి కిషోర్, ఫయాజ్, భాను ప్రతాప్, పీడీలు, మండలంలోని ఈతముక్కల, అల్లూరు, మోటుమాల, గమళ్లపాలెం, కేజీబీవీ విద్యార్థులు పాల్గొన్నారు.

బూచేపల్లి అభిమానుల సంబరాలు



కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు, బూచేపల్లి అభిమానులు

చీమకుర్తి: దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డికి వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్ష పదవి ఇవ్వడంతో చీమకుర్తిలోని వైఎస్సార్ సీపీ నాయకులు, బూచేపల్లి అభిమానులు సంబరాలు చేస్తున్నారు. శుక్రవారం చీమకుర్తిలోని బూచేపల్లి కల్యాణ మండపం వద్ద దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, దర్శి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి సుబ్బారెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కేకు కట్ చేశారు. జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి చిత్రపటాలతో ఊరేగింపు నిర్వహించారు. పెద్ద ఎత్తున వారికి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ క్రిష్టిపాటి శేఖరరెడ్డి, చిన్నపురెడ్డి మస్తాన్‌రెడ్డి, కౌన్సిలర్లు బీమన వెంకట్రావు, బడే అయ్యపరెడ్డి, సోమా శేషాద్రి, కంజుల ప్రతాప్‌రెడ్డి, పాలపర్తి వెంకట్రావు, తప్పెట బాబూరావు, మేకల యల్లయ్య, మొగిలిశెట్టి వెంకటేశ్వర్లు, పులి వెంకటరెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.

హైకోర్టు లాయర్‌ను కలిసిన బాధితులు

కురిచేడు: మండలంలోని దేకనకొండ గ్రామానికి చెందిన పలువురు హైకోర్టు లాయర్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి నికలిసి న్యాయం కోరారు. ఇటీవల మండలంలోని దేకనకొండలో జరిగిన అల్లర్లలో బాధితులైన అన్నెం కృష్ణారెడ్డి, మూర్తల బ్రహ్మారెడ్డి, పడిగపాటి చంటి, అన్నెం శివారెడ్డిలు ఆయన్ను కలిసి రిమాండ్‌లో ఉన్న తమ కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని, వీలైనంత త్వరగా బెయిల్ మంజూరు చేయించాలని, పొలాలు బీడ్లు పడుతున్నాయని వివరించారు. అందుకు సానుకూలంగా స్పందించిన పొన్నవోలు తనకు చేతనైనంత సహకరిస్తానని, బెయిల్ మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు బాధితులు తెలిపారు.



పొన్నవోలుతో దేకనకొండ యువకులు

నగర ప్రజలకు ఆహ్లాదాన్ని పంచుతాం

ఒంగోలు సబర్బన్: నగరంలోని పార్కుల్లో, రోడ్ల వెంట మొక్కలు నాటి ప్రజలకు ఆహ్లాదాన్ని పంచుతామని ఒంగోలు నగర కమిషనర్ వెంకటేశ్వరరావు తెలిపారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సాయంత్రం స్థానిక గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్‌లో నగరపాలక సంస్థ అధికారులతో కలిసి మొక్కలు నాటారు. హాస్పిటల్‌తో పాటు మెడికల్ కళాశాలలో కూడా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని అక్టోబర్ 2వ తేదీ వరకు నిర్వహిస్తున్నామన్నారు. ఒంగోలు నగరాన్ని పచ్చదనంతో నింపుతామన్నారు. నగరంలోని పార్కుల్లో కూడా ప్రజలందరికీ ఉపయోగపడే విధంగా మొక్కలు పెంచి మంచి వాతావరణాన్ని నెలకొల్పుతామన్నారు. కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు, నగరపాలక సంస్థ డీఈలు పద్మజ, గణపతిరావు, మెడికల్ కళాశాల విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.



జీజీహెచ్‌లో మొక్కలు నాటి నీరుపోస్తున్న కమిషనర్

భూవివాదంలో ఇరువర్గాల ఘర్షణ

కురిచేడు: మండలంలోని కల్లూరు భూవివాదంలో ఇరువర్గాల మధ్య శుక్రవారం రాత్రి ఘర్షణ జరిగింది. వివరాలు.. పోలెబోయిన పెద్ద పెద్దయ్య, ఆయన బంధువులు నక్కా చిన్న వెంకటేశ్వర్లు, లక్ష్మిల మధ్య చాలాకాలంగా భూవివాదం జరుగుతోంది. ఒకరిపై ఒకరు రెవెన్యూ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసుకున్నారు. ఇంతవరకు దానిపై రెవెన్యూ అధికారులు తేల్చలేదు. శుక్రవారం ఆ విషయంపై తహసీల్దార్ రజనీకుమారి.. పెద్ద పెద్దయ్యను పిలిపించి మాట్లాడారు. తిరిగి గ్రామానికి వెళ్లిన పెద్దయ్యపై నక్కా చిన్న వెంకటేశ్వర్లు వాగ్వాదానికి దిగి దుర్భాషలాడాడు. ఇంటికి వెళ్లిన పెద్దయ్య వద్దకు నక్కా చిన్నవెంకటేశ్వర్లు, కొండలు, వెంకట్రావు, ఆంజనేయులు, మరో పెద్దయ్య, సాయిరాంలు వెళ్లి గొడవ పడి అడ్డు వచ్చిన పోలెబోయిన వెంకటసుబ్బారావును కొట్టారు. నక్కా నారాయణమ్మ, లింగమ్మ, లక్ష్మీదేవిలు కారం పొట్లాలు తీసుకుని తమపైకి దాడికి వచ్చారని పెద్దపెద్దయ్య ఆరోపించారు. తమను చంపుతామని బెదిరిస్తున్నాడని పెద్దయ్య పేర్కొన్నాడు. 108కి సమాచారం అందించటంతో సిబ్బంది వెంకటప్పయ్య, యోహాను, రెహమాన్, బాషాలు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం కురిచేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వెంకట సుబ్బారావుకు గుండెకు సంబంధించిన వ్యాధి ఉండటంతో మెరుగైన వైద్యం కోసం దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు.



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

పుల్లలచెరువు: మండలంలోని అక్కపాలెం తండాలో వినాయక చవితి సందర్భంగా టీడీపీ కార్యకర్తలు దాడి చేయగా గాయపడిన బ్రాహ్మంనాయక్, వాలీబాయ్ కుటుంబానికి స్థానిక శాసనసభ్యుడు తాటిపర్తి చంద్రశేఖర్ రూ.5 వేలు చొప్పున ఆర్థిక సాయం ప్రకటించారు. నగదును బాధితునికి శుక్రవారం యర్రగొండపాలెం క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్ సీపీ నాయకులు అందజేశారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, సర్పంచ్‌లు టి.సత్యనారాయణరెడ్డి, ఎ.కోటిరెడ్డి, రమణారెడ్డి, నాయకులు రోసిరెడ్డి, నాగరాజు, శ్రీనివాసరెడ్డి, చెన్నారెడ్డి, నరసింహ పాల్గొన్నారు.

అక్రమంగా నిల్వ ఉంచిన బాణసంచా పట్టివేత

బేస్తవారిపేట: స్థానిక పట్టణంలోని పలు దుకాణాలను ఎస్సై ఎస్‌వీ రవీంద్రారెడ్డి తనిఖీ చేశారు. అనుమతులు లేకుండా బాణసంచా నిల్వ ఉంచిన ముగ్గురిపై కేసు నమోదు చేశారు. వాగిచర్ల మహేష్ గృహంలో రూ. 11,149, బీ శివశంకర కోటేశ్వరరావు షాపులో రూ.15,747, ఎం సత్యనారాయణ దుకాణంలో రూ.17,785 విలువైన బాణాసంచాను స్వాధీనం చేసుకున్నారు. అనుమతులు లేకుండా బాణసంచా అమ్మినా, నిల్వ చేసినా కేసులు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు. అర్థవీడులోని ఓ దుకాణంలో అక్రమంగా నిల్వచేసిన రూ.60,500 దీపావళి మందులను ఎస్సై సుదర్శన్‌యాదవ్ స్వాధీనం చేసుకున్నారు. దుకాణ యజమానిపై కేసు నమోదు చేశారు. లైసెన్స్ తీసుకోకుండా దీపావళి మందులు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.